# కేసీఆర్ సంకల్పం.. గురుకులాల విజయం

- బీఆర్ఎస్ హయాంలో విద్యకు పెద్దపీట
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న గురుకుల విద్యార్థులు
- ఇంటర్మీడియట్‌లో స్టేట్ 5వ ర్యాంకు సాధించిన విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 29: నిరుపేద కుటుంబాలలో పుట్టి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ మేం బాలురకు ఏ మాత్రం తక్కువ కాదు అంటూ కష్టించి చదివే సంధ్య, ఇఫ్ఫాతున్నిసా లాంటి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో నివాసం ఉండే మహమ్మద్ అబ్దుల్ గఫ్ఫార్, సఫియా సుల్తానాకు.. ఒక కుమారుడు, ఒక కూతురు కాగా కుమారుడు ఇర్ఫానుద్దీన్ తండ్రికి పాన్‌షాప్ నిర్వహణలో చేదోడు వాదోడుగా నిలువగా.. కుమార్తె ఇఫ్ఫాతున్నిసాకు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను బాగా చదివించాలనుకున్నారు. అయితే రెక్కాడితే డొక్కాడని ఆ కుటుంబానికి కుమార్తెను ప్రైవేటు పాఠశాలలో చేర్పించే స్తోమత లేదు.ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో4వ తరగతి వరకు చదివించారు.



స్టేట్ 5వ ర్యాంకు సాధించిన గురుకుల విద్యార్థిని ఇఫ్ఫాతున్నిసాను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### గురుకులాల ఏర్పాటుతో..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత విద్యావ్యవస్థలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన సమూల మార్పులతో 2017 లో నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షలో ఇఫ్ఫాతున్నిసా మౌలాలిలోని సనత్‌నగర్ గర్ల్స్-1 గురుకుల పాఠశాలలో సీటు సాధించి 5వ తరగతిలో చేరింది.

### జీవితానికి మలుపు..

2017లో గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందిన ఇఫ్ఫాతున్నిసా అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలలేదదు. ప్రతీ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ 2023 ఏడాదిలో పదవ తరగతి పరీక్షలో 10/10 పాయింట్లు సాధించింది. అనంతరం అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగం తీసుకొని 2024 సంవత్సరంలో జరిగిన వార్షిక పరీక్షలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. ప్రస్తుత 2025 సంవత్సరంలో జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మొత్తంగా 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి స్టేట్ 5వ ర్యాంకును సాధించింది. ఈ క్రమంలో ఇఫ్ఫాతున్నిసా.. జగద్గిరిగుట్ట డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అజం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను లువగా ఆమెకు ఆశీస్సులు అందజేశారు.

### కేసీఆర్ దూరదృష్టితోనే..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. కేసీఆర్ గురుకులాలతో ఎందరో నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపారని అన్నారు. ఉన్నతవిద్యను పూర్తిచేసి పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కలలు కనే నిరుపేద విద్యార్థుల ఆశలకు "కాంతి రేఖ" అయి పెద్దలు కేసీఆర్.. గురుకుల పాఠశాల సంఖ్యను పెంచి, పౌష్టిక ఆహారం, మంచి విద్యకై చేపట్టిన ఎన్నో సంస్కరణలు నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు. ఇఫ్ఫాతున్నిసాకు నా పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.

## నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిధిలో నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)ను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో.. నీట్ పరీక్ష నిర్వహణపై సెంటర్ సూపరింటెండెంట్లు, సిటీ కోఆర్డినేటర్స్, బ్యాంక్‌లు, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 4న జరిగే నీట్ పరీక్షకు జిల్లాలో 62 కేంద్రాలు ఏర్పాటు చేశామని.. 26,609 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అన్ని కేంద్రాలను ముందుగా తనిఖీ చేసి నివేదిక అందించాలని సూచించారు. ట్రాఫిక్ దృష్ట్యా అభ్యర్థులందరూ కేంద్రాలకు ముందుగా చేరుకోవాలని అన్నారు. ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఉదయం నుంచి పరీక్ష ముగిసే వరకు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, అదనపు డీసీపీలు నర్సింహారావు, రామదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

### సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

సిటీ బ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు గైర్హాజరు, ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తదనంతరం సికింద్రాబాద్ ఆర్డీఓ కార్యాలయంలోనూ కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సికింద్రాబాద్ పరిధిలో వచ్చిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులపై కలెక్టర్ ఆరాతీసారు. ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ పాండు నాయక్ ఆయన వెంట ఉన్నారు.

## తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



ప్రభుత్వాన్ని వేడుకుంటున్న ఆర్టీసీ తొలగించిన ఉద్యోగులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 29: ఆర్టీసీలో వివిధ కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించబడ్డామని, తమ ఉద్యోగాలు తిరిగి ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని తొలగించబడిన ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో దాసరి రాంబాబు, వీరాంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఎండీగా సజ్జనార్ వచ్చాకే ఆర్టీసీ అభివృద్ధి బాటపట్టిందన్నారు. ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన వారి కోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. త్వరతగతిన ఉద్యోగాలు కోల్పోయిన వారిని తిరిగి నియమించి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

## సాంకేతికతతో అధిక దిగుబడులు

### అగ్రి సైన్సెస్ అండ్ అప్లికేషన్స్ గ్రూప్ డైరెక్టర్ వేమూరి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రంగానికి సంబంధించి వివిధ రకాల సాంకేతికతలను అనుసంధానించడంతోఅధిక దిగుబడులు సాధించవచ్చని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్సీ)కు చెందిన అగ్రి సైన్సెస్ అండ్ అప్లికేషన్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ వేమూరి చౌదరి పేర్కొన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన అగ్రి విజన్-2025 సదస్సులో 'ఉత్పాదకత పెంపు మరియు స్థిరత్వానికి డిజిటల్ వ్యవసాయం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సాంకేతికత ఉపయోగంతో దిగుబడి పెరగడమే కాకుండా పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని వాతావరణ మార్పులు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వ్యవసాయ పాలసీల రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్, సలహాదారు ప్రవీణ్‌రావు, వీవై సోషల్ అండ్ స్కిల్స్‌కు చెందిన అమిత్ వాత్సాయన్ పాల్గొన్నారు.

## దేశ భద్రతకు సంపూర్ణ మద్దతు

### మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీపీ శ్రీనివాస్, సీఈ భాస్కర్ రెడ్డి, రత్నాకర్, అడిషనల్ కమిషనర్లు గీత రాధిక, వేణు గోపాల్, సరోజ, పంకజ, జోనల్ కమిషనర్లు రవికిరణ్, హేమంత్ కేశవ్ పాటిల్, ఆయా పార్టీల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# నకిలీ ఖాతాలపై చర్యలు తీసుకోవాలి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): ప్రభుత్వశాఖల లోగోలు వాడుతూ వాటి పేరుతో ఫేక్ ఐడీలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోవడం ఒక్క హైడ్రాకే చెల్లింది. సాక్షాత్తు హైడ్రాలోగో వాడుతూ హైడ్రా వారియర్స్ పేరుతో ఎక్స్ వేదికగా కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతూ పోస్టులు పెట్టిన వారిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలాంటి చర్యలూ తీసుకోరట. కేవలం వారెవరో తెలుసుకుని మందలించి వదిలేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పెద్దగా సీరియస్‌గా తీసుకోవద్దని ఇదంతా సోషల్ మీడియాలో వార్ తప్ప మనకేం సంబంధమంటూ కమిషనర్ తమ సిబ్బందితో అన్నట్లు తెలిసింది. అయితే సోమవారం నుంచి ఈ వ్యవహారంపై బీఆర్ఎస్‌తో పాటు నెటిజన్లు మండిపడుతున్నా కమిషనర్ రంగనాథ్ హైడ్రావారియర్స్‌తో తమకు సంబంధం లేదని, తాము రాజకీయాలకు అతీతమంటూ తమ అఫీషియల్ హ్యాండిల్‌పై పోస్ట్ చేశారు.

### నకిలీ ఖాతాపై చర్యలు తీసుకోవాలి..

హైడ్రా పేరుతో అనధికారికంగా, ఎటువంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హైడ్రా వారియర్స్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ బీఆర్ఎస్ సెంట్రల్ ఆఫీస్ తరపున ఆశిష్‌కుమార్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి తదితరులు మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. హైడ్రా పేరుతో నకిలీ ఖాతా నిర్వహిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ పూర్తిగా నిష్పాక్షికంగా ఉండాలని, కానీ హైడ్రా పేరుతో ఉన్న ఈ ఖాతాలో రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయని వారు పేర్కొన్నారు. హైడ్రా టీజీ పేరుతో వారు సృష్టించిన ఖాతాతోనే వాట్సప్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నడుస్తున్నాయని, అంతేకాకుండా వారు ఉపయోగిస్తున్న ఫోన్‌నెంబర్ కూడా హైడ్రా తెలంగాణ అంటూ వస్తున్నదని , దీనిపై కమిషనర్ దృష్టి సారించి బాధ్యులపై చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

## ఆర్వీ కర్ణన్‌కు శుభాకాంక్షలు



జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్వీ కర్ణన్‌ను తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్, జీహెచ్ఎంసీ అధ్యక్షులు కాట్రావల్ గోపాల్ తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోయూనియన్ నాయకులు ప్రవీణ్‌కుమార్, పరుశురాములు, మహేష్, మచ్చగిరి, ప్రభాకర్, లక్ష్మణ్, భాషా తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, ఏప్రిల్ 29

## రైతు హామీలను నెరవేర్చాలి

### డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి



మేడ్చల్, ఏప్రిల్29(నమస్తే తెలంగాణ): వడ్లకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌ను వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత వానాకాలంలో కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన సన్నవడ్లకు సంబంధించిన బోనస్ కోసం మూడు నెలల వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 15వేల ఎకరాలలో సన్నవడ్లను సాగు చేయగా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాల్‌కు రూ.2,320 మద్దతు ధర అందించగా బోనస్ రూ.500 ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేశారు. గతంలా కాకుండా ఈ యాసంగిలో పండించిన సన్నవడ్లకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వెంటనే మద్దతు ధరతో పాటు బోనస్ అందించాలి. జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కావాల్సిన రైతులు 35వేల మంది ఉంటే 6వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. దీనికి తోడు రైతు భరోసా కూడా అనేక మంది రైతులకు అందలేదని మధుకర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## రిజర్వేషన్లు పెంచకుంటే రాష్ట్రం అగ్నిగుండమే

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, ఏప్రిల్ 29: బీసీల రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తే...రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన 15 బీసీ సంఘాలతో మంగళవారం కాచిగూడ అభినందన హోటల్లో నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ కృష్ణమోహన్ హాజరై మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం పెంచాలని, అందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, చట్టం చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

# చౌడు భూముల్లోనూ బంగారు పంటలు

### కాసా చైర్మన్ పరోడా

వ్యవసాయ యూనివర్సిటీ ,(హైదరాబాద్) ఏప్రిల్ 29: దేశంలోని చౌడు భూముల్లో ఇక బంగారు పంటలు పండించవచ్చని కాసా చైర్మన్ ఆర్ఎస్ పరోడా అన్నారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ వర్సిటీ రైస్ రీసెర్చ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 60వ డైమండ్ జూబ్లీ అన్సర్ రైస్ రీసెర్చ్ గ్రూప్ సమావేశంలో శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తల ఆవిష్కారాల కృషి వలన చౌడు భూముల్లోనూ ఇకనుంచి బంగారు పంటలు పండించడం సాధ్యమేనని అన్నారు. బీపీటీ సాంబమసూరిలో 5204 ఆధారంగా మరో కొత్త వంగడాన్ని, ఎంటీయూ 1010 అనే వెరైటీ నుంచి మరో కొత్త వంగడాన్ని కనుగొని వాటి ద్వారా ఇకనుంచి తొలిసారి దేశంలోని చౌడు భూముల్లోనూ వరి పంటలు పండించడం, అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన సూచించారు. దేశంలో అధికంగా వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యక్ష, పరోక్షంగా 70 శాతం జీవనోపాధి ఉంటుందన్నారు. వాటిలో సాగులోని వరి ప్రధానంగా అధిక దిగుబడిని ఇచ్చే రకాలను చీడపీడలను తట్టుకొని, మంచి దిగుబడి నిచ్చే రకాలను కనుగొనడం శుభ సూచికమన్నారు. గత పదేళ్లలో తెలంగాణ సాగులో ప్రధానంగా వరిలో మంచి దిగుబడులను తెచ్చి దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిపిందని అదేవిధంగా ఇటీవల కనుగొన్న రెండు రకాలతో మన దేశంతో పాటు, ప్రపంచ దేశాలకు వరిని ఎగుమతి చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని వీటిపై సుదీర్ఘ చర్చ జరిపారు.



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

## ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే..

- బీఆర్ఎస్‌కు 100 సీట్లు పక్కా
- సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికల జరిగితే 100కు తగ్గకుండా సీట్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, అదే విషయం ఎల్కతుర్తి రజతోత్సవ సభతో రుజువైందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి తెలిపారు. అదే జోష్ ప్రజల్లో ఉందని చెప్పారు. రజతోత్సవ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగాన్ని రాష్ట్రంలోని సగం జనాభా చూశారని తెలిపారు. కేసీఆర్ మాటల కోసమే ప్రజలు ఏ స్థాయిలో వేచి చూశారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన ఏడాదిన్నరలోనే బీఆర్ఎస్ సభకు ఈ విధంగా ప్రజల నుంచి స్పందన రావడాన్ని బట్టి చూస్తే రాష్ట్రంలోని దాదాపు 60 శాతం ప్రజలు కేసీఆర్‌కు జై కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## జోస్ ఆలుక్కాస్‌లో అక్షయతృతీయ ఆఫర్లు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): అక్షయ తృతీయ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఆకర్షణీయమైన ఆఫర్లను తీసుకొచ్చినట్లు జోస్ ఆలుక్కాస్ మంగళవారం ప్రకటించింది. రూ.75 వేలు అంతకంటే ఎక్కువ విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఒక బంగారు నాణేన్ని ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. వజ్రాభరణాలపై ప్రతి క్యారెట్‌పై రూ.15వేలు డిస్కౌంట్‌తో పాటు ప్రతి క్యారెట్‌కు 500 మిల్లీగ్రాముల బంగారు నాణెం అందించనున్నట్లు వెల్లడించింది. అదేవిధంగా ప్లాటినమ్ ఆభరణాలకు తరుగు చార్జీలపై 15 శాతం తగ్గింపును పొందవచ్చని ప్రకటించింది. బంగారు ఆభరణాలు తరుగు చార్జీల్లో 30 శాతం వరకు, వెండి ఆభరణాలకు తరుగు చార్జీలు లభిస్తాయని తెలిపింది.

JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY

## పీడీఎస్‌యూ కోఆర్డినేషన్ కమిటీ

అంబర్ పేట, ఏప్రిల్ 29: పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో యూనివర్సిటీల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం విద్యానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, నాగరాజు..నూతన యూనివర్సిటీల కోఆర్డినేషన్ కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా పీ మహేశ్, కమిటీ సభ్యులుగానవీన్,ఎస్‌కే ఆసిఫ్, సంతోష్ (ఓయూ), అరిజ్ఞ (హెచ్‌సీయూ), మర్రి మహేశ్, రాజేష్(కేయూ), సంజయ్ (ఎంజీయూ), తెలంగాణ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, జేఎన్టీయూ నుంచి కోఆప్షన్లుగా 13 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఉన్న 12 ప్రభుత్వ యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వైశ్య అచీవర్స్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న హాస్యనటుడు బ్రహ్మానందం తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 29: వైశ్య అచీవర్స్ అవార్డు లోగోను ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఆవిష్కరించినట్లు వైశ్య అచీవర్స్ అవార్డ్స్ చైర్మన్ మడిపడిగే రాజు తెలిపారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. మే 27న ఆహ్వానం రిసార్ట్స్‌లో వేలాదిమంది వైశ్య ప్రముఖుల సమక్షంలో 'వైశ్య అవార్డ్స్ ప్రదాన ఉత్సవం' నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాస్యనటుడు బ్రహ్మానందం, వైశ్య ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, వైశ్య ప్రముఖులు బండారు సుబ్బారావు, అనిల్, మడిపడిగ రాము, నరేశ్, నీలిమ, కల్యాణి, రవి, డాక్టర్ జగన్, అరుణ్, సతీశ్, సంతోష్ పాల్గొన్నారు.

## నూతన పద్ధతుల్లో జానపద అధ్యయనం

కొండాపూర్, ఏప్రిల్ 29: జానపద సాహిత్య అధ్యయనం గత 70 సంవత్సరాల కాలంలో అనేక మలుపులు తీసుకుందని, దానిని నేడు కొత్త పద్ధతుల్లో అధ్యయనం చేయడం ద్వారా మరిన్ని విశేషాలు వెలుగులోకి వస్తాయని ద్రవిడ విశ్వవిద్యాలయం జానపద అధ్యయన శాఖ పూర్వ పీఠాధిపతి ఆచార్య పులికొండ సుబ్బాచారి పేర్కొన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బిరుదురాజు రామరాజు సాహిత్య పరిశోధన కృషిపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ తెలుగు శాఖ ఆచార్యులు ఆచార్య పమ్మి పవన్ కుమార్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జీఎంఆర్ ఆరేనాలో అంతర్జాతీయ నగల ప్రదర్శన

అమీర్పేట్ ఏప్రిల్ 29: యునైటెడ్ ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో మే 23 నుంచి మూడు రోజులపాటు బి2బి హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో 2025 జరుగునుంది. శంషాబాద్‌లోని జీఎంఆర్ అరేనాలో జరిగే ఈ జ్యువెలరీ షోకు సంబంధించిన వివరాలను మంగళవారం అమీర్‌పేట్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యునైటెడ్ ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో హైటెక్ సిటీ జ్యువెలర్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ తయాల్ వెల్లడించారు. వారు మాట్లాడుతూ.. 1.5 లక్షల చ. అడుగుల విస్తీర్ణంలో దేశ నలుమూలకు చెందిన ప్రఖ్యాత జ్యువెలరీ సంస్థలు 700 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నాయని, ఈ స్టాండ్‌ల ద్వారా 15 లక్షల పైగా నగల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జ్యువెలరీ షో వాల్‌పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.




హెచ్ఐజేఎస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

## ఐఐసీటీ మాజీ శాస్త్రవేత్తకు అరుదైన గౌరవం

- ఢిల్లీలోని బీడీజీకి విభాగాధిపతిగా ఎన్నికైన డాక్టర్ శైలజ
- 80 ఏళ్ల చరిత్రలో తొలి మహిళా విభాగాధిపతిగా రికార్డు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన మాజీ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా దోనెంపూడి అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. 80 ఏళ్ల సీఎస్ఐఆర్ చరిత్రలో ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలోని బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ (BDG)కి విభాగాధిపతి విశిష్ట శాస్త్రవేత్త (DS)గా నియమితులైన తొలి మహిళగా శైలజ నిలిచారు. తాజాగా ఆమె అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పాలిమర్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ, ఎంఫిల్ పూర్తి చేసిన తర్వాత డాక్టర్ శైలజ 1993లో ఐఐసిటిలో చేరారు. పాలిమర్ సంశ్లేషణ, క్యారెక్టరైజేషన్, అధునాతన సాంకేతికత అభివృద్ధికి ఆమె విశేష కృషి చేశారు. పరిశోధన రంగంలో ఆమె ప్రతిభకు 1996లో సీఎస్ఐఆర్ – డీఏడీ ఫెలోషిప్‌తో జర్మనీలోని కీల్ విశ్వవిద్యాలయంలో అధునాతన పరిశోధనలో పాల్గొనే అవకాశాన్ని చేజిక్కించుకుంది. 2017 నుంచి డాక్టర్ శైలజ ఐఐసిటిలో బిజినెస్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ చైర్ ఉమెన్‌గా కూడా పనిచేశారు. ఐఐసిటి సహకారంతో పరిశ్రమ అవసరాలకు అనువైన నమూనాలను అభివృద్ధి చేశారు. సాంకేతికత బదిలీ, పేటెంట్ అవుట్-లైసెన్సింగ్, పారిశ్రామిక ఆదాయాన్ని గణనీయంగా పెంచడానికి ఆమె ఎంతగానో కృషి చేశారు. పాలిమర్ కెమిస్ట్రీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్, డిప్లొమసీ, టెక్నాలజీ ట్రాన్స్ఫర్ మేనేజ్‌మెంట్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కాగా ఆమె నియామకంపై సీఎస్ఐఆర్ లేబరేటరీల పరిశోధకులు హర్షం వ్యక్తం చేశారు.

